
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 30 సంచిక : 12 ఆగష్టు 2025

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .


లోకమాన్య బాలగంగాధర్ తిలక్ – కర్మయోగి..... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 5

కర్మ మార్గం....................................... 21

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం




ఎవరు ఏ మార్గంలో
ప్రయాణం చేసినా, ఏ
గురువును ఆశ్రయించినా
దేహబుద్ధి నశించకుండా
ఆత్మజ్ఞానం కలుగదు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# లోకమాన్య బాల గంగాధర్ తిలక్ - కర్మ యోగి

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)



కొంతమంది మహాత్ములు ఉంటారు, మీ కుటుంబం గురించి మీరు ఎలా ఆలోచించు కొంటారో, అలా లోకం గురించి ఆలోచించేవాళ్ళు ఉన్నారు. గాంధీగారికి పూర్వపు నాయకుడు బాల గంగాధర్ తిలక్. ఆయన పూనాలో 1856లో జన్మించి, 1920 వరకూ జీవించి ఉన్నాడు. ఆయన చనిపోయాక గాంధీ గారికి నాయకత్వం వచ్చింది. తిలక్ గారిని అందరూ లోకమాన్యుడు అని పిలుస్తారు; 'మేకర్ ఆఫ్ మోడరన్ ఇండియా' అంటారు.

దేశం కోసం జీవితమంతా చాలా కష్టపడ్డారు, సర్వస్వం దేశానికి ఇచ్చారు. జీవితం పొడుగునా సాక్రిఫైజ్ అండ్ సఫరింగ్! సుఖం ఎలా ఉంటుందో తెలియదు. ఆయన ఆరేళ్ల జైలులో ఉండగా, భార్య చనిపోతే నేను ఇంటికి వెళ్ళి చూసి వస్తాను అని పిటిషను కూడా పెట్టలేదు గవర్నమెంటుకి. సాక్రిఫైజ్ అండ్ సఫరింగ్ – ఆ ఒక్కటి తప్ప, ఇంక రెండోది తెలియదు. ఆయనకి ముగ్గురు కొడుకులు. అమ్మ చనిపోయింది అని వాళ్ళు ఉత్తరం రాస్తే, – 'అమ్మ మీకు ఏదో పని చేసిపెట్టేది, నేను ఇంటికి వచ్చాక, అమ్మ చేసే పని మీకు నేను చేస్తాను, మీరు బెంగపెట్టుకోవద్దు'– అని తిరిగి సమాధానం రాసారు. కొన్ని వాక్యాలు చూస్తుంటే వొళ్ళు చలిస్తుంది అన్నారు శ్రీ నాన్నగారు.

తిలక్ గారు మాండలే (Mandalay) జైలులో ఉండగా భార్య స్వర్గస్తురాలు అయ్యారు

అని టెలిగ్రామ్ వస్తే, చదివి మామూలుగా జేబులో పెట్టేసుకున్నారు. అప్పుడు జైలరు మీ సహధర్మచారిణి చనిపోతే మీకు కన్నీళ్ళు కూడా రావా అంటే, ముప్పై సంవత్సరాల నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకు రావాలని ఏడుస్తున్నాను. శారీరకంగా కూడా కష్టపడుతున్నాను. కన్నీళ్ళు అన్నీ ఖర్చు అయిపోయాయి. ఇప్పుడు నా భార్య చనిపోయిందని కొత్తగా కన్నీళ్లు ఎక్కడినుంచి వస్తాయి, దుఃఖపడటానికి కళ్ళలో నీళ్ళు ఉండాలి, మనస్సులో వేదన ఉండాలి, రెండూ కనపడటం లేదు అన్నాడు.

ఆయన గొప్ప వీరుడు, ఎక్కడా పిరికితనం కనబడదు. పైనున్న ఆకాశము వచ్చి నా తలమీద పడిపోయినా, నేను చేయవలసిన డ్యూటీ మానను, దాన్ని కింద పడేసి కాళ్లతోటి తొక్కి నా పని నేను చేస్తాను – అని పూనాలో తిలక్ గారి ఇంటి గోడ మీద రాసారు. అంత వీరత్వం ఇండియాలో ఎవడికీ లేదు. స్వరాజ్ ఈజ్ మై బర్త్ రైట్, అండ్ ఐ షల్ హేవ్ ఇట్ (స్వరాజ్యము నా జన్మహక్కు. దానిని నేను పొంది తీరతాను.) వాళ్ళకి ఏమీ అక్కరలేదు, పని తప్ప. ఈ పని వల్ల మనం ఏదైనా లాభం పొందుతామా లేదా అనే సమస్య వాళ్ళకి లేదు.

తిలక్ గారు బహుముఖ మేధావి. ఆయనకి తెలియని బ్రాంచి లేదు. అస్ట్రానమి, అస్ట్రాలజీ, మాథమాటిక్స్, పోలిటికల్ సైన్స్ ఇంకా చాలా సబ్జెక్టులు తెలుసు. సంస్కృతంలో మహా పండితుడు. ఆధ్యాత్మికంగా కూడా బాగా లోతులు ఉన్న మనిషి. భగవద్గీత మీద 1600 పేజీలు వ్యాఖ్యానం రాసాడు. ఆయనకు బాగా ఇష్టమైన శ్లోకం –

**కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన!**
**మా కర్మఫల హేతుర్భూః మా తే సంగోస్త్వ కర్మణి ॥ 2-47 ॥**

ఈ శ్లోకానికి పొంగిపోయి వంద పేజీల వ్యాఖ్యానం రాసాడు. ఇక్కడ నాలుగు సూత్రాలు చెప్పాడు, ఇవి భగవద్గీతకి నాలుగు స్థంబాలు అన్నాడు. మంచానికి నాలుగు కోళ్ళు ఉంటాయి. అలాగే భగవద్గీతకి నాలుగు కోళ్ళు ఈ శ్లోకం అని చెప్పాడు. నువ్వు కర్మ చెయ్యటానికే పనికి వస్తావు, భగవంతుడు నీకు కేటాయించిన పని అయిష్టంగా కాకుండా, ఇష్టంగా చెయ్యి. అలా చేయకపోతే రాబోయే జన్మలో మళ్ళీ ఆ కర్మే నిన్ను వెంటాడుతుంది.

ఫలితం మీద ఆశక్తి పెట్టుకోవద్దు. ఫలితం నీ చేతిలో లేదు, అది పూర్వజన్మ సుకృతాన్ని బట్టి ఉంటుంది. నువ్వు ఆశిస్తే ఎక్కువ, ఆశించకపోతే తక్కువ రాదు, భగవంతుడి ఆజ్ఞను బట్టి వస్తుంది. అలాగని అసలు కర్మ మీదే విరక్తి పెట్టుకోవద్దు. దీని కీలకం ఏమిటంటే, ఫలితం తక్కువ వచ్చినా, నువ్వు చేయవలసిన డ్యూటీ నువ్వు చేస్తే, దైవానుగ్రహం వస్తుంది. నా అనుగ్రహమే నీకు ఆత్మజ్ఞానం కలగచేస్తుంది.

తిలక్ గారికి గోపాలకృష్ణ గోఖలే గారితో రాజకీయంగా అభిప్రాయ బేధాలు ఉన్నాయి. కాని వాళ్లకి ఒకరి ఔన్నత్యం ఒకరికి తెలుసు, 1916లో గోఖలేగారు చనిపోయినప్పుడు తిలక్ చేసిన ప్రసంగంలో, ఆయనకి గోఖలే పట్ల ఎంత గౌరవం ఉందో తెలుస్తుంది. అసూయ అనేది ఒక్క మాట లేకుండా, సబ్జెక్టుకే పరిమితమై గోఖలే గురించి గంట సేపు మాట్లాడాడు.

స్వామి వివేకానందకి తిలక్ గారికి అనుబంధం ఉండేది. బేలూరు మఠం వెళ్ళినప్పుడు తిలక్ సరదాగా అన్నారు, స్వామీజీ మేము చేసే పని కన్నా మీరు చేసే పనే బాగుంది. చిరకాలం కలకాలం ఉంటుంది. మీరు రాజకీయాలలోకి వచ్చేయండి, నేను మఠంలోకి వచ్చేస్తాను అన్నాడు, అప్పుడు నరేంద్రుడు అంటాడు – భగవంతుడు మీకు కేటాయించిన పని మీరు చెయ్యాలి, నాకు కేటాయించిన పని నేను చెయ్యాలి. మీ శరీరం ద్వారా మీకు కేటాయించిన పనే జరుగుతుంది. నన్ను ఈ పని చేయటానికి భగవంతుడు నియమించాడు కాబట్టి నా ఉపాది ద్వారా ఇదే జరుగుతుంది. మిమ్మల్ని ఆ పని చేయటానికి, నన్ను ఈ పనికి నియమించిన వాడు పరమేశ్వరుడే.

వాళ్ళు కేవలం లోకం కోసం వచ్చిన కారణజన్ములు. మనము మంచి కర్మో చెడ్డ కర్మో, ఏదో ఖర్మ అనుభవించటానికి పుడతాము. వాళ్ళు ఏదో కారణం కోసం, ఏదో పని నిమిత్తం లోకంలోకి వచ్చిన వాళ్ళు. బద్దజీవులు కాదు, వాళ్ళు ముక్తజీవులు. లోకంలోకి వచ్చిన పని చూసుకొని వెళ్ళిపోతారు కాని ఇదంతా నాది, నేను అనే తలంపే అసలు వాళ్ళకు రాదు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 27 ఫిబ్రవరి 1995, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజున ఆది శంకరుల యొక్క జయంతి మహోత్సవం జరుపుకొంటున్నాము. ఆదిశంకరులు ఈ భూమి మీదకు వచ్చి సుమారు 1200 ల సంవత్సరాలు అయ్యింది. ఆయన కేరళ రాష్ట్రంలో కాలడి అనే ఒక గ్రామంలో జన్మించారు. ఆచార్యుల వారి తల్లి తండ్రులకి చాలాకాలం సంతానం లేదు. సంతానం కోసం త్రిచూర్‌లో ఉన్న శివాలయం దగ్గరకి వచ్చి ప్రార్థించేవారు. ఒక రోజున స్వప్న దర్శనం ఇచ్చి త్రిచూర్ శివుడు నీకు ఎక్కువ కాలం జీవించే చాలామంది సంతానం కావాలా, లేకపోతే సర్వజ్ఞుడు, బుద్ధిమంతుడు, ఆచార్య పురుషుడు సర్వ వేదముల యొక్క సారం తెలిసిన వాడు చాలా తక్కువ కాలం ఈ భూమి మీద ఉంటాడు. అటువంటి పిల్లవాడు కావాలా, నువ్వు ఆలోచించుకుని చెప్పమన్నాడు శివుడు. ఏమి ఆలోచిస్తాం అప్పటికప్పుడు శివగురువు ఏమని చెప్పాడు అంటే ఏదో వ్యర్థులుగా ఎక్కువకాలం జీవించే వాళ్ళ కంటే తక్కువ కాలం జీవించినప్పటికీ సర్వజ్ఞుడు అవ్వటమే మంచిది కదా, అందుచేత తక్కువ కాలం జీవించినప్పటికీ సర్వజ్ఞుడని ప్రసాదించమని శివ గురువు అడిగాడు. అప్పుడు శివుడు ఏమని చెప్పాడు అంటే నా అంశ వల్ల ఒకడు జన్మిస్తాడు అని చెప్పాడు. ఆచార్యుల వారి నక్షత్రం ఆరుద్ర నక్షత్రం, తిథి పంచమి, వైశాఖ మాసం, కాలడిలో జన్మించారు. కానీ దురదృష్టం ఏమిటి అంటే ఆచార్యుల వారు మూడవ సంవత్సరంలో ఉండగానే తండ్రి గారు స్వర్గస్తులు అయ్యారు. ఇంక ఈ పిల్లవాడిని తల్లిగారు పెంచేవారు. ఆయనకు ఐదవ సంవత్సరంలో ఉపనయనం చేశారు. తల్లి ఆచార్యుల వారికి చదువు చెప్పించింది. ఆచార్యుల వారు కూడా భిక్ష చేసుకునేవారు. ఆచార్యుల వారు చదువుకునే రోజులలో, భిక్షకి ఒక ఇంటికి వెళితే ఆ ఇంటిలో పెట్టటానికి ఏమీ లేదు. ఆ అమ్మగారు చాలా మంచి ఆవిడ. ఈయన చూస్తే బాలుడు, చదువుకునే పిల్లవాడు మన ఇంటికి వచ్చాడు. పెట్టడానికి అన్నం లేదు. పోనీ తినటానికి ఏదైనా ఇద్దాం అంటే అదీ

లేదు. వట్టి చేతుల తోటి పంపేస్తున్నాం అని బాధపడుతూ ఏదైనా ఉంటే పెట్టి పంపుదాం బిడ్డని అని, వెళ్ళిపోమని అనలేక ఆ గదిలోంచి ఈ గదిలోకి, ఈ గదిలోంచి ఆ గదిలోకి తిరుగుతోంది. అంటే వాళ్ళు అంత దారిద్ర్యం తోటి ఉన్నారు. వాళ్లకి మనకి తేడా ఏమిటి అంటే వాళ్లకి భౌతికమైన దారిద్ర్యం ఉండవచ్చు కానీ ఆలోచనా దారిద్ర్యం వాళ్లకి లేదు అందుకే వాళ్ళు పవిత్రులు అయ్యారు. మనకి డబ్బులు ఉన్నప్పటికీ ఆలోచనా దారిద్ర్యం ఉంది, అందుకే మనం ఎదగలేక పోతున్నాం. కొంతమందికి డబ్బు ఉంటుంది, comforts ఉంటాయి, ఆలోచనలో అతి ధరిద్రులుగా ఉంటారు. మనిషి అసలు పొరపాట్లు చెయ్యటానికి ఆలోచనా దారిద్ర్యమే కారణం. మనిషి ఏదైనా ఒక పొరపాటు చేశాడు అంటే అక్కడ ఆలోచనా దారిద్ర్యం ఉన్నట్టే గుర్తు. ఈ అమ్మగారికి భౌతికమైన దారిద్ర్యం ఉన్నా ఆలోచనా దారిద్ర్యం లేదు. సరే అలా ఇంట్లో తిరుగుతూ ఉంటే ఒక గూట్లో ఉసిరికాయ కనిపించింది. అప్పుడు ఆ ఉసిరికాయ తీసుకొచ్చి ఆయన చేతిలో పెట్టింది. వాళ్ళ poverty చూసి ఆచార్యుల వారు చాలా బాధ పడ్డాడు. అప్పుడే లక్ష్మీదేవి మీద ఒక స్తోత్రం చేశారు. దానిని కనకధారా స్తోత్రం అంటారు. ఇప్పుడు కూడా డబ్బు కావలసిన వాళ్ళు అందరూ కూడా ఆ స్తోత్రం చదువుతారు. ఆ స్తోత్రం చేస్తే లక్ష్మీదేవి “నువ్వు స్తోత్రం చేస్తున్నావు, ఈ అమ్మగారికి ఏదైనా ఇమ్మంటున్నావు. మరి వీళ్ళు పూర్వ జన్మల్లో ఎవరికీ ఏమీ పెట్టిన మనుషులు కాదు” అని చెబుతుంది. “పూర్వ జన్మల గొడవ ఎందుకు, ఇప్పుడు నాకు ఆవిడ ఉసిరికాయ ఇచ్చింది కదా ఆవిడ చేతి తోటి, ఇది దానమే కదా. అందుకు అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాను” అంటే అప్పుడు లక్ష్మీదేవి బంగారపు ఉసిరికాయల వర్షం కురిపించింది. తరతరాలుగా ఆ కుటుంబం ఇప్పటికీ కాలడి దగ్గరలో ఉంది. ఆచార్యుల వారు విద్యా స్వరూపుడు. ఆచార్యుల వారికి దేవుడు ఎవరు అంటే విద్యే దేవుడు. రాముడు దేవుడు, కృష్ణుడు దేవుడు, శివుడు దేవుడు అని చెప్పటం కంటే ఆచార్యుల వారికి విద్యే దేవుడు. స్నానాలు చెయ్యడం తరువాయి ఇంక పుస్తకాలు తియ్యండి అనేవాడు ఆయన శిష్యులను పట్టుకొని తోమేసేవాడు. ఎందుచేత అంటే ఆయన విద్యా స్వరూపుడు. అయితే ఇంత చదువు చదివి ఆచార్యుల వారు ఏమన్నారు అంటే ఆత్మ గురించి శ్రవణం చెయ్యాలి అంతకంటే మీకు శ్రవణం చెయ్యడానికి ఈ లోకంలో

ఏముంది అన్నాడు.  ఆత్మ ఒక్కటే సత్యం, బ్రహ్మం ఒక్కటే సత్యం, మీరు శ్రవణం చేస్తే దాని ఒక్కదాని గురించే శ్రవణం చెయ్యాలి.  అంతకంటే శ్రవణం చెయ్యడానికి ఈ లోకంలో ఏముంది, అంతా మిథ్యే కదా, అంటే ఒక్క బ్రహ్మము తప్పించి మిగతా అంతా మీ మనస్సు కల్పితమే, మీ మనస్సు కల్పించిన గొడవలు గురించి శ్రవణం ఏమి చేస్తారు, శ్రవణం చెయ్యదగినది ఈ లోకంలో బ్రహ్మము ఒక్కటి మాత్రమే.  ఆయనకు ఎనిమిదో సంవత్సరం వచ్చింది అప్పటికే విద్యలు అన్నీ పూర్తి అయ్యిపోయాయి, సర్వజ్ఞుడు అయ్యాడు, సర్వ శాస్త్రాలు శ్రవణం చేశాడు, ఇల్లు విడిచి పెట్టి వెళ్ళవలసిన సమయం వచ్చింది.  ఆయన నివసించిన గ్రామం కాలడి, దానికి పక్కనే కొంత దూరంలో పూర్ణా నది ఉంది.  ఆచార్యుల వారి తల్లి రోజూ అక్కడ స్నానానికి వెళ్ళేది.  వేసవి కాలం స్నానానికి వెళ్ళడానికి కష్టపడేది. ఆచార్యుల వారు ఇంకొక ఆరు నెలలకి ఇల్లు విడిచి పెడతారు అనగా, ఒక రాత్రి ఏమి చేశాడు అంటే “మా అమ్మ రోజూ స్నానం చెయ్యడానికి కష్ట పడుతోంది, అందుచేత నీ దారి మా ఇంటి పక్క నుంచి వెళితే ఆవిడ స్నానం చేసి వచ్చేస్తూ ఉంటుంది” అని నది దేవతని ప్రార్థించారు.  అలా ప్రార్థించగా వెలుగు వచ్చేసరికి ఆ నది వీళ్ళ ఇంటి పక్క నుంచి వెళ్ళడం జరిగింది.  మీకు అందరికీ ఇది అంతా అసత్యం, నదిని ప్రార్థిస్తే మార్గం మారుస్తుందా అని అనిపిస్తుంది.  అంటే మనకు చెడ్డ బుద్ధి ఎక్కడ ఉంది అంటే మనకి చేతకాని విషయాలు, మన బుద్ధికి అందని విషయాలు, మన శక్తికి మించిన విషయాలు అన్నీ అబద్ధాలు అని అనుకుంటాం.  ఆచార్యుల వారి తల్లికి ఇష్ట దేవత బాలకృష్ణుడు.  ఈ బాలకృష్ణుడు నదీ



**నీకు కర్మ చేసే అధికారం ఉంది, ఫలితం ఎంతవస్తే అంతే దానితో సంతృప్తి పడు. ఫలం ఎక్కువ వచ్చిందని సంతోషించ వద్దు, తక్కువ వచ్చిందని దుఃఖ పడొద్దు. సంతోషం వల్ల, దుఃఖం వల్ల ద్వంద్వాలు పెరుగుతాయి, నీ స్వరూపానికి దూరం అయిపోతావు.**

ప్రయాణం గతి మార్చినప్పుడు ఈ బాలకృష్ణుడు విగ్రహం ఏమో నదిలో మునిగిపోయింది. "నువ్వు నదిని మన ఇంటి పక్కన మార్చావు, సంతోషంగా ఉంది మరి నేను రోజూ అర్చన చేసుకునే నా కృష్ణుడు అందులో మునిగి పోయాడు" అని తల్లి గొడవ చేసింది. అప్పుడు ఆచార్యుల వారు ఏమి చేశారు అంటే ఆ నదిలో మునిగిపోయిన కృష్ణుడిని తీసుకొచ్చి నది ఒడ్డున స్థాపించి గుడి కట్టించారు. ఇప్పుడు కూడా ఆ గుడి ఉంది. తండ్రి అనుమతి ఇవ్వక పోయినప్పటికీ తల్లి అనుమతి తీసుకుని సన్యాసం తీసుకోవడానికి వెళ్ళాలని శాస్త్రంలో ఉంది. అయితే మాములుగా ఇల్లు విడిచి పెట్టి వెళతాను, సన్యాసం తీసుకుంటాను అంటే ఏ తల్లి అయినా అంగీకరించదు. పైగా ఒక్క అబ్బాయే కదా, పోనీ నలుగురు ఉన్నారు అనుకో ఒక అబ్బాయిని దేశానికి సమర్పిద్దాం మిగతా అబ్బాయిలు మనకి ఉంటారు అనుకోడానికి ఆచార్యుల వారు ఒక్కరే. అప్పుడు ఆచార్యుల వారు ఏమి చేశారు అంటే ఒకరోజున ఆయన, తల్లి ఇద్దరూ స్నానం చేస్తున్నారు. ఒక దొంగ మొసలిని ఈయనే సృష్టించాడు. ఆ మొసలి వచ్చి ఏమి చేసింది అంటే ఈయన కాళ్ళు పట్టుకుని లాక్కు పోతుంది, ఈయనేమో ఆ మొసలి కూడా నదిలోకి వెళ్ళిపోతున్నారు. ఆలా నదిలోకి వెళ్లిపోతుంటే నేను చనిపోతున్నాను అని ఈయన కేకలు పెట్టాడు. ఒక్కడే అబ్బాయి కదా ఆవిడ బాధ పడింది అయితే ఆచార్యుల వారు ఏమన్నారు అంటే నేను సన్యాసం తీసుకోవడానికి నువ్వు అంగీకరిస్తే ఈ మొసలి విడిచి పెట్టేయటానికి అవకాశం ఉంది అన్నారు. మనకి అప్పటికప్పుడు ఆలోచన తట్టడం చాలా కష్టం. కానీ ఆచార్యుల వారి తల్లికి ఒక ఆలోచన తట్టింది. చనిపోయిన కొడుకు కంటే బ్రతికున్న కొడుకు మెరుగు కదా, వాడు ఇప్పుడు చనిపోతున్నాడు. సన్యాసం పుచ్చుకుంటే ఎక్కడో ఒకచోట ఉంటాడు. కాశీ లోనో, రామేశ్వరం లోనో, ఎక్కడో ఒకచోట ఉంటాడు. ఎప్పుడైనా మనం చూడాలి అంటే చూడవచ్చు. అసలు చనిపోయిన వాడు కంటే సన్యాసం పుచ్చుకుని బ్రతికి ఉన్నవాడు మెరుగు కదా అని ఆచార్యుల వారి తల్లికి స్ఫురించింది. అసలు బ్రతికుంటే ఇంటి దగ్గర కాకపోయినా ఎక్కడో ఒకచోట కనిపిస్తావు కదా అని సన్యాసానికి తల్లి అనుమతి ఇచ్చింది. ఆచార్యుల వారు ఏమి చెప్పారు అంటే వారసత్వ దృష్ట్యా వచ్చే ఆస్తి, ధనం అది నాకు ఏమీ

అక్కర్లేదు, మీరు అనుభవించి మా అమ్మని జాగ్రత్తగా చూస్తూ ఉండండి. ఆవిడ అవసాన దశలో మటుకు నేను వస్తాను అని చెప్పాడు. అవసాన దశలో, నువ్వు మనిషిని ఎవరిని పంపక్కర్లేదు నేను ఎక్కడ ఉంటానో నీకు తెలియదు కదా, అవసాన దశలో ఒకసారి స్మరణ చేసుకో, వస్తాను అని తల్లికి చెప్పి ఆచార్యుల వారు ఆ పూర్ణా నది ఒడ్డు నుంచే వెళ్ళిపోయారు. ఒక సంవత్సరం దేశం అంతా తిరిగారు, దేశ పరిస్థితులు అన్నీ చూశాడు. అన్నీ తిరిగాడు. అప్పుడు ఆయనకు ఆయనే ఒక మంత్రం చదువుకుని సన్యాసం పుచ్చేసుకున్నాడు. "కాశీ వెళ్లి నువ్వు అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించు" అని గోవింద భగవత్పాదుల యొక్క సలహా మీద ఆచార్యుల వారు కాశీ వచ్చారు. గంగానది ఒడ్డున మకాం పెట్టుకున్నారు. రోజూ గంగానదిలో స్నానం, విశ్వేశ్వరుని ఆరాధించుకోవడం, పండితులని అందరినీ ఆహ్వానించి ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు పాఠాలు చెప్పడం ప్రారంభించాడు.

అలా ఒక సంవత్సరం పాఠాలు చెప్పాడు. ఒకటి యజ్ఞం, రెండు దానం, మూడు తపస్సు. ఇవి మూడూ విడిచిపెట్టవద్దు అని చెప్పాడు. నీకు బ్రహ్మానుభవం కలిగినప్పటికీ కనీసం ఇతరుల కోసం అయినా ఇవి మూడు విడిచి పెట్టొద్దు అన్నాడు. ఇవి మూడు వేరుగా మీకు కనిపిస్తాయి. కాని యజ్ఞంలో దానం ఉంది, యజ్ఞంలో తపస్సు ఉంది. ఈ లోకానికి సంబంధించినది కానీ పరలోకానికి సంబంధించినది కానీ ఏమీ వాంఛించకుండ ఇతరులకు మనం చెయ్యగలిగిన సహకారం చేస్తుంటే అదే యజ్ఞం. ఆ యజ్ఞంలోనే దానం ఉంది, ఆ యజ్ఞంలోనే తపస్సు కూడా ఉంది. ఉపనిషత్తులు అన్నీ సమన్వయము చేసి, వేదాలను సమన్వయం చేసి, ఆయన బ్రహ్మ సూత్రాలు రచించాడు. ఆ బ్రహ్మ సూత్రాలకి వ్యాఖ్యానం రాసి, ఉపనిషత్తులకి వ్యాఖ్యానం రాసి, భగవద్గీతకి వ్యాఖ్యానం రాసి, దేశం అంతా కూడా మూడు సార్లు పర్యటన చేసి దేశంలో వాటిని ప్రచారం చేసి, అద్వైత మతాన్ని స్థాపించారు ఆచార్యుల వారు. ఆయనది జ్ఞాన మతం. నిప్పు లేకపోతే వంట ఏ విధంగా అయితే అవ్వదో, అలాగే జ్ఞానం లేకపోతే మోక్షం రాదనీ చెప్పారు. ఆచార్యుల వారిని ఏమన్నారు అంటే ఊరికే రాసి వదిలేస్తే సరిపోదు, దానిని ప్రచారం చెయ్యాలి, ఇంకో

పదహారు సంవత్సరాలు నీకు జీవితం పొడిగించాం అన్నారు వ్యాసులవారు. అంటే పదహారో సంవత్సరంలో వెళ్లిపోవాలి ఆచార్యుల వారు మాములుగా, ఇంకొక పదహారు సంవత్సరాలు ఈ భూమి మీద నువ్వు జీవించు అన్నారు. బ్రహ్మానుభవం పొందిన తరువాత వాడికి శరీరం ఉన్నా ఒక్కటే, ఊడిపోయినా ఒక్కటే. పైగా ఆ శరీరానికి స్నానం చెయ్యటం, అన్నం పెట్టటం అదనపు చాకిరి వాడికి. శివుడుకు ఉన్న మణి ఆ రేవులో పడిపోతే దానికి మణికర్ణిక ఘాట్ అని పేరు వచ్చిందని చెబుతారు. ఆ రేవులో ఆచార్యుల వారు స్నానం చేసేవారు. ఆచార్యుల వారిని మొట్టమొదట పద్మపాదుడు చూసింది ఆ స్నానాల రేవులో చూశాడు. పద్మపాదుడు ఆచార్యస్వామి కంటే వయస్సులో పెద్దవాడు. స్నానం చేసేటపుడు చూశాడు. Love at first sight అని చెబుతారు. కొంతమంది మనుషులని చూస్తే చూడగానే వాళ్ళ మీద ఆప్యాయత కలుగుతుంది. దానికేదో జన్మాంతర అనుబంధం లేకపోతే ఆ ప్రేమ, ఆప్యాయత కలగడానికి అవకాశం లేదు అని కాళిదాసు చెప్పాడు. ఆయన మాతృభాష మలయాళం. కానీ ఆయన ఏది మాట్లాడినా సంస్కృతమే, ఏది రాసినా సంస్కృతమే, వ్యవహారం కూడా సంస్కృతమే, అంతా సంస్కృతమే. అపారమైన భాషా పండితుడు. వస్తువు చేతిలో ఉంది అంతకంటే ఏమి కావాలి. బ్రహ్మానుభవం చేతిలో ఉంది, ఆయనకున్న భావాలను expression చెయ్యడానికి మహా ప్రవాహం లాగ తన భావం కంటే భాష ముందుకి ఉరకలు వేస్తూ వచ్చేది ఆచార్యుల వారికి. భారతదేశ సమైక్యత కోసం చాలా కృషి చేశారు ఆచార్యుల వారు, ఏదో ఒక ప్రాంతీయ బుద్ధి లేదు. కొంతమంది మాకు దేశభక్తి ఉంది, దేశభక్తి ఉంది అంటారు. పాలకొల్లు నుండి నరసాపురం transfer చేస్తే వాళ్లకి మనసు ఒప్పదు. అదేమి దేశభక్తి, దేశం అంటే ప్రజలే కదా, ఇంతకీ మీకు ఎందుకు చెబుతున్నాను అంటే ఆచార్యుల వారు అవ్వడానికి కేరళ వాడే, కానీ మా కేరళ భాషే గొప్పది అని ఇటువంటి మాటలు ఏమి చెప్పలేదు ఆయన, దేశ సమైక్యత కోసం కృషి చేశాడు. ఆచార్యుల వారు కన్యా కుమారి మొదలు కాశ్మీర్ వరకు మూడు సార్లు తిరిగాడు. ఆయన మఠాలు కూడా ఎలా స్థాపించాడు అంటే ఒక రాష్ట్రంలోనే స్థాపించలేదు. మొదట దేశానికి తూర్పున


పూరీ జగన్నాథంలో పద్మపాదుడిని పీఠాధిపతిగా పెట్టాడు. తరువాత దక్షిణాదిన శృంగేరిలో సురేశ్వరాచార్యుడని పీఠాధిపతిగా పెట్టాడు. తరువాత పడమరన ద్వారకలో పీఠాధిపతిగా హస్తామలకుడిని పెట్టాడు. ఉత్తరాన బదరికాశ్రమంలో పీఠాధిపతిగా తోటకాచార్యుడిని పెట్టాడు. అలా స్థాపించి జ్ఞాన మార్గాన్ని బోధిస్తూ దేశం అంతా తిరిగాడు. శంకరుడు మంగళ స్వరూపుడు, విద్యా స్వరూపుడు. ఆయన దేశం అంతా తిరిగి అనేక గ్రంథాలు రాశాడు. ఆయన ఆంధ్రాలో మటుకు ముఖ్యంగా మూడు చోట్ల కొంతకాలం ఉన్నాడు. శ్రీశైలం, తిరుపతి, కాళహస్తిలలో కొంత కాలం ఉన్నాడు. ఆయన శివానందలహరి శ్రీశైలం లోనే రాశాడు. మీరు ఎప్పుడైనా శ్రీశైలం వెళితే చూడండి శంకరాచార్యుల వారు తపస్సు చేసుకున్నటువంటి చోటు కూడా శ్రీశైలం వెళ్ళే దారిలోనే ఉంది. భగవద్గీత యొక్క వైభవం, ఉపనిషత్తులు యొక్క వైభవం, వేదాల యొక్క వైభవం ఇట్టిది అని దేశం అంతా ప్రచారం చేసాడు. తల్లి శరీరం విడిచి పెట్టడానికి రెడీగా ఉంది. ఆచార్యుల వారు జీవితం అంతా కూడా దేశం యొక్క పర్యటన మీద ఆయన తల్లికి ఏమీ సేవ చేయలేదు. తల్లి కోరినది ఒక్కటే నీ చేతితో కొంచెం నిప్పు పెట్టమని కోరింది. దానికి ఆచార్యులవారు అప్పుడు సరే అన్నారు, ఆ ప్రకారం తల్లి అవసాన దశలో అక్కడకు వచ్చారు. అక్కడ బ్రాహ్మణులు అందరూ “నువ్వు సన్యాసివి, తల్లి శవానికి నువ్వు నిప్పు పెట్టకూడదు. అందుచేత నువ్వు కూడా రా దహన సంస్కారం మేము చేస్తాము” అంటే “నా చేతి తోటి నిప్పు పెడతాను అని నేను నా తల్లికి మాట ఇచ్చాను. అందుచేత ఆవిడకి ఇచ్చిన మాట నెరవేరుస్తాను” అన్నారు ఆచార్యుల వారు అన్నారు. అక్కడ ఉన్నవాళ్ళు పేచీ పెట్టినా, వాళ్ళు సహకరించకపోయినా తల్లికి ఇచ్చిట మాట కోసం ఆయన భుజం మీద శరీరం వేసుకుని నిప్పు కూడా ఆయనే పుట్టించి, ఆయనే పుల్లలు పేర్చేసి ఆయన చేతి తోటి దహన సంస్కారం చేసేసి అక్కడ చిన్న సమాధి కట్టి దాని ఎదురు గుండా ఒక స్తంభం పెట్టి ఆ స్తంభం మీద ఈయన ఇల్లు విడిచి పెట్టి వెళ్లిపోయినప్పటికీ రోజు ఒక దీపం వెలిగించమని చెప్పాడు. 1200 సంవత్సరాల నుంచి ఆ దీపం ఎవరో ఒకరు అలా వెలిగిస్తూనే ఉన్నారు. దానిని ఆర్యాంబ సమాధి

అంటారు, దీప స్తంభం అంటారు. ఆయన మొట్టమొదట రాసిన గ్రంథం విష్ణు సహస్రనామాలకి వ్యాఖ్యానం. చివర రాసిన గ్రంథం వివేక చూడామణి. అక్కడ నుంచి కేదార్ వెళ్ళాడు. ఆయన వచ్చిన పని అయ్యిపోయింది. అక్కడ కేదార్‌లో ఒక గుహ ఉంది, దత్తాత్రేయుడు గుహ అంటారు. చివరి రోజున కూడా ఆయన teaching విడిచి పెట్టలేదు. Teaching చెబుతూనే ఇంకా ఏదైనా మీకు సందేహాలు ఉంటే అడగండి అని చివరి క్షణం వరకు teaching చెబుతూనే మీరు ఇంక నా కూడా రాకండి అని అక్కడ ఆ దత్తాత్రేయ గుహలోకి వెళ్లి అదృశ్యం అయిపోయారు. శంకరాచార్యుల వారి శరీరం శవం అవ్వలేదు అదృశ్యం అయ్యిపోయింది. ఆయన మరణాంతరం అంటే శరీరం విడిచి పెట్టేసిన తరువాత కలహం పుట్టకుండా, ఈ పీఠాలు ఏ విధంగా నడుచుకోవాలో అంతా రాసి ఆయన శరీరం విడిచి పెట్టారు. ఆచార్యుల వారి జీవిత చరిత్ర సంగ్రహంగా మనం చెప్పుకున్నాము.

భగవాన్ చెపుతున్నారు మీరు ఏదైతే నేను, నేను అంటున్నారో అదే నిజం అయితే అసలు గొడవే అక్కర్లేదు, అది నిజం కాదు కాబట్టి ఈ బోధలు. మీరు ఏదైతే నేను నేను అంటున్నారో అదే గనుక బ్రహ్మం అయితే అసలు teaching అక్కర్లేదు అన్నారు. అది బ్రహ్మము కాదు, కేవలం body జడం, బ్రహ్మము చైతన్యం. ఆచార్యుల వారు ఇంక కాలమాన పరిస్థితులు గురించి దేవతలు అని, అది అని స్తోత్రాలు అన్నీ చెబుతూ ఉండేవారు. భగవాన్‌ది direct method. భగవాన్ చెబుతూ ఉంటారు కదా, first class passenger అని. First class passenger స్టేషన్ దాటిపోతుందని కంగారు పడక్కర్లేదు కండెక్టర్ ఇంక పది నిమిషాలలో ఆ స్టేషన్ వస్తుంది అనగా బెర్త్ దగ్గరకి వచ్చి మనల్ని లేపుతాడు. First class passengers కి ఆ అవకాశం ఉంది. మీకు అర్థం అవుతోందా భగవాన్ చెప్పే technique చూడండి, direct method ఎదురుగా మీకు కనిపించేటప్పుడు indirect method ఎందుకు అని భగవాన్ చెబుతున్నారు. హృదయం ఎక్కడో నీకు దూరాన లేదు. ప్రతీ వాడికి నేను అనే బుద్ధి ఉంది. ఈ నేను అనే బుద్ధి ఎక్కడ ఉదయిస్తుందో అదే హృదయం. ఉన్నది ఒక్కటే వస్తువు, అది చైతన్యం. నువ్వు విష్ణువు అనుకున్నా, శివుడు అనుకున్నా, శంకరుడు అనుకున్నా, రాముడు

అనుకున్నా, యెహోవా అనుకున్నా, అల్లా అనుకున్నా, ఆ చైతన్యమే. ఆ నేను అనే బుద్ధి నీ లోపల నుంచే ఉదయిస్తుంది. భౌతిక హృదయం లోంచి కాదు. ఆధ్యాత్మిక హృదయంలో నుండి వస్తుంది. అంటే ఈ నేను అనే బుద్ధి ఎక్కడి నుంచి అయితే ఉదయిస్తుందో, అదే ఆధ్యాత్మిక హృదయం, అక్కడే నిజమైన దేవుడు ఉన్నాడు. నిజమైన controller అక్కడే ఉన్నాడు, చైతన్యం అక్కడే ఉంది. భగవాన్ ఏమన్నారు అంటే ఈ నేనుకు కొంత జడ బుద్ధి ఉంది, కొంత చైతన్యబుద్ధి ఉంది అన్నారు. నువ్వు హృదయంలోకి బాగా వెళ్ళిపోవక్కర్లేదు, కొంత చాలు. దానికి సమీపంలోకి వెళ్ళినప్పటికీ చైతన్యబుద్ధి అందుకుంటుంది అన్నారు. ఎందుచేత అంటే ఆ అంశ దీనికి ఉంది కాబట్టి. దాని అంశ ఉంది కాబట్టి, జడ స్వరూపం కొంత ఉంది, చైతన్య స్వరూపం కూడా కొంత ఉంది. అందుచేత ఈ false ఎక్కడ నుంచి వస్తుంది. దీనిని కొంచెం withdraw కనుక నువ్వు చేస్తే, అంటే చైతన్యం నీ హృదయంలో ఉంది కాబట్టి నువ్వు అక్కడకి కనుక పంపించగలిగితే ఆత్మ స్థానంలో నువ్వు కనుక ఉంచ గలిగితే అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. దేవుడికి మరొక పేరు హృదయం. చైతన్యానికి మరొక పేరు హృదయం. ఆత్మకి మరొక పేరు హృదయం. ఆత్మకి మరొక పేరు హృదయం అని ఎందుకు వచ్చింది అంటే అది హృదయంలో ఉంటుంది కాబట్టి. ఈ నేనును దాని పుట్టు స్థానంలోకి ఉపసంహరించగలిగితే, ఈ నేనుని direct గా పట్టుకుని హృదయంలోనికి తోలుకు వెళితే అక్కడ అది నశిస్తుంది. మాయ అంతా ఇక్కడే ఉంది మీరు బాగా అర్థం చేసుకోండి. సముద్రంలో ఎంతో నీరు ఉంటుంది. పైన కూడా చిన్న చిన్న కెరటాలు

**ఆడంబరం, అవినయం**
**ఈ రెండూ ఉన్నవాడికి,**
**వాడు ఎంత సాధన చేసినా,**
**ఎన్ని జన్మలు ఎత్తినా ఆత్మజ్ఞానం రాదు.**




ఉంటాయి. మన మనస్సులో వచ్చే గొడవలు, ఈ బాహ్యంగా వచ్చే గొడవలు ఇష్టాలు, అయిష్టాలు, ఈ కామ క్రోధాలు, ఈ struggles, ఈ సంసారం గొడవలు ఈ ప్రకృతి గొడవలు ఇవన్నీ ఊరికే పైన వచ్చే చిన్న చిన్న బుడగలు కెరటాలు లాంటివి, ఈ బుడగలు తోటి, కెరటాల తోటి తాదాప్యం నువ్వు పొందితే లోపలకి మునిగేది లేదు, నీకు వస్తువు దొరికేది లేదు అంటున్నారు భగవాన్. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటంటే ఎప్పుడైతే నువ్వు సత్యాన్ని అన్వేషణ చేస్తున్నావో, ఆ అన్వేషణ చేసే ప్రయత్నంలోనే ఈ నేను సన్న పడిపోయి చచ్చిపోతుంది. సత్యాన్వేషణ చెయ్యటం ప్రారంభించి ఆ సత్యం సన్నిధానంలోకి వెళ్ళేటప్పటికే అది burn అయ్యిపోతుంది. ఆ నేనును withdraw చెయ్యి, అయితే నువ్వు ఎప్పుడు withdraw చెయ్యగలవు, ఈ గొడవలు పెట్టుకుంటే withdraw చెయ్యలేవు. వాళ్ళు కొట్టారు, వీళ్ళు తిట్టారు, వాళ్ళు అలా అన్నారు, వీళ్ళు ఇలా అన్నారు అని ఈ బాహ్య గొడవలు, ఈ చిల్లర చిల్లర గొడవలు పెట్టుకోవద్దు. సత్పురుషుల సహవాసం వలన మన మనస్సుకు పవిత్రత వస్తుంది. అంటే మల్లెపువ్వుల దగ్గర కూర్చుంటే మల్లె పువ్వుల వాసన ఎలా వస్తుందో, గులాబి పువ్వుల దగ్గర కూర్చుంటే గులాబి పువ్వుల వాసన మనకి ఎలా వస్తుందో, holy people దగ్గర కూర్చోవడం వలన మనకు holiness వస్తుంది. అంటే పవిత్రుల తోటి ఉన్న అనుబంధం వల్ల ఆ vibrations, స్పందన వస్తుంది. ఒక holy man ఈ గదిలో కూర్చున్నాడు అనుకోండి వాడి నుండి వచ్చే vibrations మన మీద పని చేస్తాయి. మీరు doors మూసేసినప్పటికీ అక్కడున్న vibrations మనమీద పని చేస్తాయి. ఎందుచేత భావనా బలానికి ఈ తలుపులు అడ్డేమి రావు. అందుచేత భగవాన్ ఏమి చెప్పారు అంటే అలలు, పైపైన నురుగులు, పైపైన బుడగలు దాటి మీరు వెళ్లిపోవాలి అంటే మీరు ఏమి చెయ్యాలి అంటే ఒకటి ఈశ్వరుడి యందు ప్రేమ కలిగి ఉండటం, రెండు సత్పురుషుల తోటి సహవాసం చెయ్యడం వలన మీకు strength కలుగుతుంది. మనస్సుకి బలం చేకూరుతుంది. మనస్సుకి బలం చేకూరడం అంటే ఏమిటి, అక్కర్లేని విషయాలు నిరోధించ గలుగుతారు. ఏది నిజ విచారణ అంటే మీకు తలంపులు వస్తున్నాయి. ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి. నేను ఉంటే

వస్తున్నాయి, నేను లేకపోతే మీకు తలంపులు లేవు. ఏ తలంపు వచ్చినా ఎవరికి వస్తుంది అంటే నేనుకే వస్తుంది. నువ్వు ఎవరు అని ఆ నేనుని ప్రశ్నిస్తూ ఉండు. మనం మాములుగా ఎదుటి వాడిని అడుగుతూ ఉంటాం, నువ్వు ఎవరు, నువ్వు ఎవరు అని, అలాగే భగవాన్ ఏమంటున్నారు అంటే ఆ నేనుని అడుగు నువ్వు ఎవరు అని, ఆ నేనుని నువ్వు ప్రశ్నించడం నేర్చుకో, దానిని ప్రశ్నించడం ఎప్పుడైతే నేర్చుకున్నావో అది withdraw అవుతూ ఉంటుంది. అప్పుడు దానికొచ్చే తలంపులు కూడా నీకు తగ్గుతూ ఉంటాయి. మీరు ఒకటి అర్థం చేసుకోండి, భగవంతుడిని శరణాగతి పొందండి అని మన పురాణాలు చెబుతూ ఉంటాయి. మన శాస్త్రాలు చెబుతూ ఉంటాయి కదా, దాని అర్థం ఏమిటి అంటే భగవంతుడికి శరణాగతి పొందే కొలది దేహగతమైన నేను పలుచబడిపోతూ ఉంటుంది. అంటే మనస్సు ఎప్పుడు పలుచబడుతుంది అంటే ఎవడైతే దేవుడికి శరణాగతి పొందుతున్నాడో, ఎవడైతే భగవంతుడికి తనని తాను అర్పించుకుంటున్నాడో వాడికి దేహగతమైన నేను నశిస్తూ ఉంటుంది. ఇది బాగా అర్థం చేసుకోండి. శరణాగతి వల్ల వాడికి ego నశిస్తుంది. ప్రతీ ప్రాణికి దుఃఖం ఉంది. ఆ దుఃఖాన్ని ఆర్పటం కోసమే బుద్ధుడు జీవితం పొడవునా ప్రయత్నం చేశాడు.

ఆచార్యుల వారు ఏమన్నారు అంటే మీకు దుఃఖానికి కారణం మమకారం. బయట వ్యక్తులు కారణం కాదు. నీ మమకారం తీసేసి దుఃఖం ఉందేమో చూడు. బాహ్యమైన భోగాలు నీకు అమృతం లాగ కనిపిస్తాయి. ఇంత గొప్పగా కనిపించే భోగాలు పరిణామంలో నీకు దుఃఖాన్ని తీసుకు వస్తాయి. "ఇంత గొప్పగా కనిపించే భోగాలను నువ్వు బాహ్యంగా త్యాగం చేసినప్పటికీ నీ గురువు యొక్క పాదాల మీద నీకు భక్తి లేకపోతే నీకు జ్ఞానం కలగదు అన్నారు ఆచార్యుల వారు. అంటే ఈ భోగాలు ఎంత అందంగా కనిపిస్తే అంత దుఃఖం తీసుకు వస్తాయి. తల్లి తండ్రులు నీకు శరీరాన్ని ఇచ్చారు, కానీ గురువు జ్ఞానాన్ని ఇస్తాడు. దానివల్ల నీకు మోక్షం వస్తుంది" అంటారు ఆచార్యుల వారు. బాహ్యమైన భోగాలను త్యాగం చెయ్యగల శక్తి నీకు ఉన్నప్పటికీ గురువు యొక్క పాదాలు మీద నీకు ధ్యాస లేకపోతే, భక్తి లేకపోతే గురువు

పాదాలు మీద నీకు గనుక దృష్టి లేకపోతే నీకు ఆ బ్రహ్మానుభవం, జ్ఞానానుభవం కలుగనే కలుగదు. అక్కడ గురువు అంటే పాఠాలు చెప్పేవాడు గురువు అని కాదు బ్రహ్మానుభవం ఉన్నవాడు గురువు. ఆచార్యుల వారు చెప్పేది ఏమిటంటే, మామూలుగా బడిలో పాఠాలు చెప్పేవాడు గురువు అని కాదు, బ్రహ్మానుభవం ఉన్నవాడు గురువు. నువ్వు నిద్ర స్థితిలో ఎలా ఉంటున్నావో జాగ్రదావస్థలో కూడా అలా ఉండటం నేర్చుకో, దానివల్ల కొన్ని చిల్లర గొడవలు తగ్గిపోతాయి అంటే నీకు అక్కర్లేని గొడవలు ఊడిపోతాయి. నిద్రలో ఎలా ఉంటున్నావో నువ్వు అలా జాగ్రదావస్థలో ఉండటం నేర్చుకో, అప్పుడు ఈ అబద్ధమైన నేను దాని అంతట అదే జారిపోతుంది. దానికి ఆహారం దొరకక కృశించి రాలిపోతుంది అంటున్నారు భగవాన్. అబద్ధమైన నేను రాలిపోయింది అని నువ్వు కంగారు పడక్కర్లేదు. అబద్ధమైన నేను పోయి నిజమైన నేనుకి చోటు ఇస్తుంది. ఆ నిజమైన నేనే బ్రహ్మము. అప్పుడు వాడికి దేహం తోటి కానీ, లోకం తోటి కానీ, దేవుడి తోటి కానీ పనే లేదు, వాడు స్వతంత్రుడు అవుతాడు. అది ప్రత్యక్షానుభవం, అది ప్రత్యక్షంగానే మీకు అనుభవంలోకి వస్తుంది. కానీ అది అనుభవంలోకి రాకపోవడం వలన అసలు అదే లేదు అని నువ్వు అనుకుంటున్నావు. దానికి నీకు గురువు యొక్క సహాయం కావాలి. ఆ వస్తువు నీదే, నీ హృదయంలోనే ఉంది. కానీ నీకు అనుభవంలోకి రావాలి. దానికి మీకు గురువు సహాయం అవసరం. ఇప్పుడు ఆ వస్తువు మీకు తెలిసిపోయింది అనుకోండి, బ్రహ్మము మీకు తెలిసిపోయింది అనుకోండి, అప్పుడు మీకు ఇంక సాధన చేద్దాం అన్నా సాధన చేసేవాడు జారిపోతాడు. ఇప్పుడు మీరు అందరూ ఏమనుకుంటున్నారు ఎంతకాలం మేము సాధన చెయ్యాలి అనుకుంటున్నారు. కొంతమంది రోజూ ఎక్కడ చెయ్యగలం, ఎంతకాలం చెయ్యగలం అని అనుకుంటున్నారు కదా, ఈ సాధన చేసేవాడు ఎవడు? అహంకారే. మనస్సే కదా సాధన చేసేది, బ్రహ్మానుభవం కలిగిన వెంటనే ఆ ప్రాసెస్‌లోనే సాధన చేసేవాడు చచ్చిపోతాడు. తర్వాత సాధన చెయ్యాలి అనుకున్నా మీకు బ్రహ్మానుభవం కలిగాక ఆ సాధన చెయ్యడానికి ఎవడు అక్కడ మిగలడు అంటున్నారు భగవాన్, అంటే అప్పుడు మీకు సాధనల తోటి అవసరం లేదు, అప్పుడు మీకు బరువులు లేవు, బాధ్యతలు లేవు, బ్రహ్మానుభవం

పొందినవాడి బరువు బాధ్యత దేవుడు మీద వేసుకుంటాడు. అహంకారం ఉన్నవాడు వాడి బరువు వాడి మీదే వేసుకుంటాడు. బ్రహ్మానుభవం పొందిన వాడి బరువు బాధ్యత ఎవడు మోస్తాడు ఈశ్వరుడే మోస్తాడు. మేము కష్టపడి పోతున్నాము, చాలా బాధ్యత తోటి ఉన్నాము, చాలా బరువులు మోస్తున్నాము, చాలా గొడవల తోటి ఉన్నాము అని చాలామంది అంటూ ఉంటారు. భగవాన్ ఏమంటున్నారు అంటే అహంకారం అనే గడప దాటి చూడండి అప్పుడు ఈ గొడవలు ఉంటే చెప్పండి అంటున్నారు. మీ ద్వారా పని జరిగిపోతూ ఉంటుంది. మీరు quite గా ఉంటారు. మీరు కొత్త చీర కొనుక్కున్నారు అనుకోండి ఎన్ని రోజులు కొత్తగా ఉంటుంది. మొదటిసారి కట్టుకున్నప్పుడే కొత్తగా ఉంటుంది. రెండో సారి కట్టుకున్నప్పుడు పాతే. అలాగే మోక్షం విలువ తెలియక చాలామంది కొత్త జన్మ కోరుకుంటారు. కొత్త జన్మ ఎంతకాలం సరదాగా ఉంటుంది, ఒక నాలుగేళ్ళు, ఐదేళ్ళు, సరదాగా ఉంటుంది తరువాత పాత బడిపోతుంది, మోక్షస్థానంలో ఉన్న శాంతి, మోక్షం యొక్క వైభవం మనకి తెలియక దానిని కోరుకోము. కొత్త కొత్త జన్మలు కోరుకుంటూ ఉంటాం. కొత్త కొత్త జన్మలు కోరుకున్నప్పుడు కొత్త కొత్త వాతావరణాలు వస్తూ ఉంటాయి. జీవుడికి Transfer లు చేస్తారు కదా, ఆ కొత్త bodies కొంతకాలం సరదాగా ఉంటాయి తరువాత మళ్ళీ పాత బడిపోతాయి. అది కూడా మాయే. ఈ ప్రశ్నించే వాడు "ధ్యానం చేసేటప్పుడు మనస్సుని హృదయంలో నిలబెట్టమని మీరు అడుగుతున్నారు. కానీ నా మనస్సు బయటకి తేలిపోతోంది. హృదయంలో ముంచమని, హృదయంలో నిలబెట్టమని మీరు అడుగుతున్నారు కానీ నా మనస్సు బయటకి తేలిపోతోంది"



**ఒకవేళ నువ్వు ఏదైనా సాధించినా, అది భగవంతుడి అనుగ్రహం లేకుండా, భగవంతుడి సంకల్పం లేకుండా నువ్వు సాధించలేదు. భగవంతుడు నీకు సాధించి పెట్టినదే, నేను సాధించాను అనుకొంటున్నావు. దాని వల్ల అహంకారం బలపడిపోతుంది. నీకు జన్మలు పెరిగిపోతాయి.**

అని భగవాన్‌తో అంటున్నాడు. అప్పుడు భగవాన్ "తేలిపోతున్న వస్తువును ముంచడానికి ఏవో కొన్ని ఉపాయాలు ఉండాలి. శ్వాస నిమయం మనసుని కొంత శాంతింప చేస్తుంది. కొంతమంది ఏమి చేస్తారు ప్రాణాయామం చేస్తూ ఉంటారు అంటే ప్రాణం గతి చూస్తూ ఉంటారు. లోపలున్న దేవుడు మనకి కనిపించక పోయినా, ఈ గాలి కనిపిస్తోంది కదా, అందుచేత దానిని పట్టుకో" అన్నారు. అంటే భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే, ఈ ప్రాణాయామం వల్ల కూడా మనస్సుకి కొంత తూకం పెరుగుతుంది, మనస్సు కొంత లోపలకి దిగుతుంది అంటే ప్రాణాయామం కూడా మనస్సు కొంత అంతర్ముఖం అవ్వడానికి సహాయం చేస్తూ ఉంటుంది. అది ఎవరో గురువు గారి దగ్గర నేర్చుకున్నాను అన్నాడు. భగవాన్ దగ్గర కూర్చొని వాడు మాములుగా గాలి పీల్చేస్తున్నాడు వదిలేస్తున్నాడు. కాని వాడికి కుంభకం అలవాటు అవ్వలేదు, వాడికి కుంభకం అలవాటు లేక గాలి బయటకి వచ్చేస్తోంది. మీకు అర్థం అవుతోందా, వాడు ఊరుకోవాల్సింది కాని భగవాన్‌తో నేను గాలి నిలబెట్టుకోలేక పోతున్నాను. బయటకి వచ్చేస్తోంది అన్నాడు. అప్పుడు భగవాన్ అన్నారు మొత్తం గాలి అంతా బయటకి వచ్చేస్తే ధరిద్రం వదులుతుంది అన్నారు. అంటే ఏమిటి సూర్యుడు ప్రకాశిస్తున్నాడు అనుకోండి కిరసనాలు దీపం ఎందుకండీ, వాడు ఇంటి దగ్గర చేసుకుంటే ప్రాణాయామం చేసుకోవచ్చు కానీ భగవాన్ ఎదురుగుండా ప్రాణాయామం ఏమిటండి, ఇంట్లో కరెంటు ఉన్నా సరే మేము కిరసనాలు దీపాలు వెలిగించుకుంటాం అంటే ఇంక ఆ మనుషులకి ఎవరు చెబుతారు. వాడు జ్ఞాన సూర్యుడు ఎదురుగుండా కూర్చున్నాడు. నేను దీపం వెలిగించుకోవాలి అంటున్నాడు అంటే వీడికి ఆ విద్య వచ్చును కాబట్టి అది భగవాన్‌కు చూపించాలి అని లోపల వాడి ఉద్దేశ్యం. వాడు, ఏదో నేర్చుకుని వచ్చాడు, లోపల ఉన్నది కక్కేస్తే పోతుంది తరువాత నోరు నొప్పి పెట్టి వాడే ఊరుకుంటాడు అనేవారు భగవాన్. ఏక వస్తువుని ఒక అవతార పురుషుడిని కానీ ఒక గురువుని కానీ ఒక సద్వస్తువుని ఏదో ఒక వస్తువు మీద నీ మనస్సును నిలబెట్టి ఉంచడం. భగవాన్ ఏమి చెప్తారు అంటే పది చోట్ల పది గెడ్డపారలు వేసే బదులు ఒకచోట పది గెడ్డ పారలు వెయ్యండి నీరు వచ్చేస్తుంది అన్నారు. జ్ఞాన మార్గం, కర్మ మార్గం

ఏదో ఒక మార్గాన్ని తీసుకుని ప్రయాణం చేయండి. కానీ విశ్వాసం సడలకుండా చూసుకోండి. ఈ సైతాను ఏమి చేస్తుంది విశ్వాసం మధ్య మధ్యలో తగ్గేలా చేస్తుంది. వెనక్కి తీసుకు వచ్చేయటం కోసం, మైండ్ ఏమి చేస్తుంది అంటే విశ్వాసం తగ్గేలా చేస్తుంది. అప్పుడు విశ్వాసం మటుకు సడలకుండా చూసుకోండి. మీకు నచ్చిన మార్గంలో మీరు ప్రయాణం చెయ్యండి. నీ ప్రాణాయామం, నీ ధ్యానం, నీ జపం ఏమి చేస్తాయి అంటే హృదయం లోంచి మనసు బయటకి రాకుండా బరువు పెట్టి ఆపుతాయి, హృదయంలో నీ మనస్సు నిలబడి ఉండటానికి సహకరిస్తాయి. అప్పుడు హృదయంలో మనస్సు ఎక్కువ కాలం ఉండటం వల్ల అది అక్కడ కరిగిపోతుంది. మీ హృదయం యొక్క లోతుల్లోకి దిగే అలవాటు మీకు లేదు అనుకోండి మీరు ఎంత ప్రయత్నం చేసినా quite గా ఉండలేరు. మీరు ఏ పని చేసినా, ధ్యానం చేసినా విసుగు లేకుండా చెయ్యాలి. కొంతమంది పని చేస్తారు కానీ విసుక్కుంటూ ఉంటారు. మీరు ఏది చేసినా, ధ్యానం చేసినా, దానం చేసినా, పూజ చేసినా, శ్రద్ధగా చెయ్యి, అశ్రద్ధగా చెయ్యకు. అది చిన్న పని అని తీసి పారేసినట్టు చెయ్యకు. చిన్న పని కూడా సమగ్రంగా చెయ్యి, గొప్పగా చెయ్యి. విసుగు వద్దు. కొంతమంది ప్రతీ చిన్న విషయానికి విసుక్కుంటారు, వాళ్లకి మానసికమైన అనారోగ్యం అయినా ఉండాలి, శారీరక అనారోగ్యం అయినా ఉండాలి. కొంతమంది ప్రతీ మాటకి విసుక్కుంటూ ఉంటారు తరువాత వెంటనే I am sorry అంటూ ఉంటారు. అలాగ వద్దు మీరు ధ్యానం చేసినా, ప్రాణాయామం చేసినా, ఏది చేసినప్పటికీ break లు పడకూడదు, తైలధారవలే చేస్తూ ఉండాలి. నువ్వు పని చేస్తున్నావు అనుకో ఆ పనిలో కూడా నీ meditation కనిపించాలి. అలా పని నువ్వు శ్రద్ధగా చేస్తున్నావు అనుకో అదే ధ్యానం నీకు, అప్పుడు ధ్యానం చెయ్యడం వలన ఏ ఫలితం వస్తుందో, పని దగ్గర మనస్సు పెట్టి శ్రద్ధగా చేస్తే అదే ఫలితం వస్తుంది అంటున్నారు భగవాన్. అంటే నీ మాటలో హృదయం ఉండాలి. నీ పనిలో హృదయం ఉండాలి. తరువాత నీ సాధనలో హృదయం ఉండాలి. అది ఎలా ఉండాలి. అంటే విరామం ఉండకూడదు. Slow గా వెళ్ళినా ఫరవాలేదు, విరామం లేకుండా ప్రయాణించు. ఇప్పుడు నది చూడండి దాని ప్రవాహమే ప్రవాహం. దిక్కులు చూస్తుందా,

దిక్కులు చూడదు. ఆగమంటే ఆగుతుందా, ఆగదు. ప్రవాహమే దాని పని, సముద్రంలోకి వెళ్ళే వరకు, సముద్రంలో ఐక్యమయ్యే వరకు దాని ప్రయాణం ఆగదు. అలాగే నువ్వు బ్రహ్మానుభవం పొందే వరకు గమ్యం చేరేవరకు నీ ప్రయాణం ఆపు చేయకు. విరక్తి లేకుండా, విశ్రాంతి లేకుండా ప్రయాణం చెయ్యి. ఏదో ఒక రకంగా హృదయంలో నీ మనస్సుని నిలబెట్టి ఉంచడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి, ఇక్కడ భగవాన్ చెబుతున్నారు తేలే మనస్సుని హృదయంలో ముంచడానికి అనేక ఉపాయాలు ఉన్నాయి, అందులో సత్పురుషుల సహవాసం కూడా ఒకటి అంటున్నారు. రామకృష్ణ పరమహంస గారు అంటారు సహజంగా గాలి వస్తుంటే ఈ సీలింగ్ ఫ్యాన్ల తోటి, టేబుల్ ఫ్యాన్ల తోటి పనేముంది. అలాగే నీకు సహృదయం ఉన్నవాళ్ళు, సత్పురుషుల సహవాసం దొరికితే ఈ ముక్కు మూసుకోవటాలు, ఈ గొడవలు తోటి పనేముంది అన్నారు. అంటే ఈ ప్రాణాయామాల తోటి పనేముంది అన్నారు. ఈ ప్రాణాయామం ఎటువంటిది అంటే టేబుల్ ఫ్యాన్, సీలింగ్ ఫ్యాన్ వంటిది. నీకు Natural గా గాలి వచ్చేస్తూ ఉంటే అది సత్పురుషుల సహవాసం లాంటిది. సత్పురుషుల సహవాసం కోసం, జ్ఞాన సముపార్జన కోసం, అవసరం అయితే భూమి యొక్క అంచుల దాకా నువ్వు ప్రయాణం చెయ్యి అంటాడు ఐన్‌స్టీన్.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# కర్మ మార్గం

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

కర్మ మార్గం ద్వారా తరించాలంటే, కర్మ ఎలా చెయ్యాలి, పని ఎలా చేస్తే మనస్సు పవిత్రమై ఆత్మజ్ఞానం కలుగుతుంది – సద్గురు శ్రీ నాన్నగారి మాటలలో.....

**కర్మ యోగంగా చేస్తే జ్ఞానం వస్తుంది**

పని ద్వారా నువ్వు నేర్చుకోవలసిన పాఠాలు, పొందవలసిన అనుభవాలు ఉంటాయి – అందుకే ఈ శరీరం వచ్చింది. అందుచేత, నువ్వు చేసే పని తొందరగా చెయ్యకు, చిరాకుగా పరాకుగా చెయ్యకు. నువ్వు చేసే పని సక్రమంగా చేస్తే, విశ్వాసంతోటి శ్రద్ధగా కనుక చేస్తుంటే, అది ధ్యానం తోటి సమానం. ఒకవేళ అది ధ్యానం కాదు అనుకొంటున్నారేమో. హిమాలయ పర్వతాలకి వెళ్లి నువ్వు ధ్యానం చేస్తాను అంటున్నావు కదా, ఇది కూడా ధ్యానమే అన్నారు భగవాన్. నువ్వు శివాలయంలోకి వెళ్లి శివుడికి అభిషేకం చెయ్యటం ఎలాంటిదో, నువ్వు ఇంటి దగ్గర చేసే పని శ్రద్ధగా చేస్తే, ఇష్టంగా చేస్తే, అది కూడా ధ్యానం తోటి సమానం, ఆత్మజ్ఞానం తోటి సమానం. Work done in true spirit is Meditation, it is also knowledge, it is enlightenment!

Offer first all our actions as a sacrifice to the highest and the highest only! (మనం చేసే కర్మలన్నీ ఈశ్వరార్పితంగా చెయ్యాలి). కర్తృత్వం లేకుండా పని చేస్తే అది నీకు వికాసం కలగజేస్తుంది, జ్ఞానోదయం కలగటానికి సహాయపడుతుంది. అదే కర్మయోగం! అయితే వాడికీ ఫలితం వస్తుంది, కాని వాడిని అంటదు ముట్టదు. పాముకి కోరలు తీసేసి, దానిలోని విషం పిండేసారు అనుకోండి, అది కరిచినా మనల్ని ఏమీ చెయ్యలేదు. నిష్కామ కర్మ అటువంటిది. ఎవడైతే నిష్కామ కర్మ చేస్తున్నాడో, వాడికి ఫలితం వస్తుంది కాని వాడిని కర్మ బంధించదు.

**పని కోసమే పనిని చెయ్యాలి; ఆ పనిని ప్రేమించి చెయ్యాలి**

పని కోసమే పనిని చెయ్యాలి. ఏదో యాంత్రికంగా కాకుండా, నువ్వు ఏ పని అయితే చేస్తున్నావో ఆ పనిని ప్రేమించి చెయ్యాలి. ఫలితం కోసం పని చెయ్యకూడదు. నీకు అనుకోకుండా ఏదైనా ఫలితంవచ్చినా, నీ సంకల్పం తోటి, నీ కోరిక తోటి, నీ దేహబుద్ధి తోటి సంబంధం లేకుండా, నీకు ఏమైనా ఫలితం వస్తే, అది నిన్ను ఏమీ బంధించదు. మనిషి సామాన్యంగా ఈ పని చేస్తే మనకి ఎంత గౌరవం వస్తుంది, ఎంత ఫలితం వస్తుంది, అలా బేరీజు వేసుకుంటాడు. లెక్క వేసుకొని, ఫలితం వస్తుంది అంటే పని చేస్తాడు, లేకపోతే చెయ్యడు. కనీసం మాట సహాయం కూడా చెయ్యడు. కొంతమంది గౌరవం కోసం పని చేస్తారు. అలా గౌరవం కోసం పని చేసే వాడి కంటే కూలివాడు మెరుగు అన్నాడు పరమాత్మ.

**ప్రేమ కోసం పని చేస్తే మోక్షసుఖం వస్తుంది**

ఆత్మజ్ఞాన సముపార్జనకి మనస్సుని బుద్ధిని లోపల తయారు చెయ్యాలి అంటే, పనిలో క్రమశిక్షణ ఉండాలి. కేవలం డబ్బు కోసం, జీతం కోసం, పని చేసే వాడు అస్తమానూ గడియారం చూసుకొంటూ, గంట ఎప్పుడు కొడతారా అని కనిపెట్టుకొని ఉంటాడు. కొంతమంది కలిసిరాకపోతే నవ్వరు, నవ్వితే ఏమి కలిసివస్తుందా అని చూస్తూ ఉంటారు. మాట్లాడితే మనకి ఏమి కలిసి వస్తుందా అని ఆలోచించి పని చేసేవాళ్ళు, కేవలం డబ్బు కోసం, నూటికినూరు పాళ్ళు జీతం కోసమే పని చేసే వాడు కూలి వాడు. జీతం కోసం పని చేస్తే మీకు జీతం వస్తుంది. పొట్ట బాగానే వెళ్ళిపోతుంది, కాని అసలు సున్నా. నీ బుద్ధి నియమింప బడాలి అంటే, నీకు మోక్ష సుఖం, నిర్వాణ సుఖం, స్వర్గ సుఖం కావాలంటే, నువ్వు ప్రేమ కోసం పని చెయ్యి.

**కర్తృత్వం లేని కర్మ వల్ల అలసట కలగదు**

కర్తృత్వం లేకుండా కర్మ చేసేవాడు మాత్రమే బుద్ధి మంతుడు. కర్తృత్వం లేకుండా కర్మ చేస్తే నువ్వు చేసినా చెయ్యని వాడితోటి సమానం. నీ చేత పని చేయించేవాడు లోపల

ఒకడు ఉన్నాడు. నువ్వు నిర్మలంగా, నిశ్చలంగాఉంటే, లోపల ఉండి ఎవడైతే నీ చేత పని చేయించాలో, నీ దేహం ద్వారా వాడు పని చేయించుకుపోతూ ఉంటాడు. వాడిని జ్ఞాపకం పెట్టుకొని పని చేస్తే అలసట ఉండదు. అలా కర్తృత్వం లేని కర్మ చేస్తూ ఉంటే అప్పుడే స్నానం చేసి బయటికి వచ్చారా అన్నట్టు ఉంటారు. మనం ఐదు నిమిషాలు మాట్లాడితే, 'ఐ యాం టైర్డ్' అనుకుంటాము. అసలు మనిషి టైర్ అవ్వటానికి కారణం పని కాదు, ఆ పని నేను చేస్తున్నాను అనే తలంపు వల్ల టైర్ అవుతాడు. ఆ భావనే తొందరగా అలసట తీసుకొస్తుంది

భగవాన్ ముప్పైవేల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. లాస్ట్ డే ఆయన శరీరం విడిచిపెట్టేవరకూ టీచింగ్ విడిచిపెట్టలేదు. ఇంకొక నాలుగు రోజులలో ఆయన శరీరం పడిపోతుంది అనగా భక్తులను ఆపుచేస్తే – ఎవరినీ నా దగ్గరికి రానివ్వటం లేదు. నన్ను ఊరికే చూసి వెళ్లిపోతాము అంటున్నారు, ఎదుటి మనిషి చూడటానికి కూడా పనికిరాని ఈ దేహానికి ఇంక మజ్జిగ అన్నం మట్టుకు ఎందుకు, అన్నారు.

అరుణాచలేశ్వరుడు ఏ పని చేసినా సైలెంట్ గా చేస్తాడు. మిమ్మల్ని అనుగ్రహించినట్టు మీ పక్క వాడికి కూడా తెలియదు. అంటే భగవంతుడు ఎలా పని చేస్తున్నాడో, మనం కూడా అలా పని చేయటం నేర్చుకుంటే, ఆయన స్వరూపాన్ని మనకి ఇస్తాడు. మనం లోకంలో గుర్తింపుల కోసం పని చేస్తున్నాము కాని భగవంతుడి సంతోషం కోసం పని చేయటం లేదు, భగవంతుడికి ఇతరులు లేరు. వాడికి గుర్తింపులు అక్కరలేదు. అలాగే మీరు కూడా గుర్తింపులు అక్కరలేకుండా పని చేస్తే దేవుడు సంతోషించి ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు.

**కీర్తికాంక్ష విడిచి భగవంతుని అనుగ్రహం కోసం పని చెయ్యాలి.**

కీర్తి కాంక్ష వికాసం ఆపుచేసేస్తుంది. మామిడి పండుని కాకులు వచ్చి పొడిచేస్తే లేకపోతే మనం తినే అన్నం కుక్క వచ్చి ముట్టుకుంటే, ఇంక వాటిని మనం తినకుండా వదిలేస్తాము. అలాగే ఈ జీవుడు ఎంత మంచి వాడు అయినప్పటికీ, వాడిని కీర్తి కాంక్ష

కనుక పట్టుకుంటే, దేవుడు మనని కూడా వదిలేస్తాడు.


మామూలు మనుషుల మాట వదిలేయండి, ఎంత గొప్ప వాళ్ళు అయినప్పటికీ, పెద్ద వయస్సు వచ్చేసి చావటానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు కూడా కీర్తి కాంక్ష విడిచిపెట్టరు. దాని వల్ల లోపల కుళ్ళిపోతూ ఉంటారు అని శాస్త్రంలో చెపుతారు. మిల్టన్ 'పారడైస్ లాస్ట్' అని ఒక పోయెట్రీ రాసాడు. అందులో చెపుతాడు – ముసలితనం వచ్చాక కోరికలు తగ్గిపోవచ్చు, ఇంట్లో జరుగుబాటు ఉండక అణిగి ఉండవచ్చు, బయటికి వెళ్లి సంపాదించే శక్తి పోవచ్చు, ఇవన్నీ పోవచ్చు కాని ఆ చచ్చిపోయే వాడికి కూడా కీర్తి కాంక్ష పోదు అన్నాడు.

అందుచేత నువ్వు ఏదైనా మంచి పని చేస్తే కీర్తిని దృష్టిలో పెట్టుకొని చెయ్యకు. గొప్పలకి వెళ్తే తిప్పలు వస్తాయి. భగవంతుడి యొక్క అనుగ్రహం పొందటానికి చెయ్యి. ఏసుక్రీస్తు అంటాడు – ఇతరులు మాట వదిలేయండి, మీ కుడిచేయి చేసే పని కూడా ఎడమ చేతికి ఎందుకు తెలియాలి అంటాడు.

**పొగడ్తలకి, విమర్శలకి స్పందించకుండా ఉండటం నేర్చుకో**

నువ్వు ఏదైనా పని చేసినప్పుడు, నిన్ను పొగిడే వాళ్ళు ఉంటారు, తిట్టే వాళ్ళు ఉంటారు. అప్పుడు రియాక్ట్ అవ్వవద్దు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. నువ్వు మంచి పని చేసినా, నీ మీద అసూయ ఉన్నవాళ్ళు, నీ మీద ఇష్టం లేని వాళ్ళు నిన్ను విమర్శిస్తారు. విమర్శిస్తే నువ్వు రియాక్ట్ అవుతావు. అది విమర్శించిన వాడిది తప్పు కాదు. ఆ విమర్శకి నీ ప్రతిస్పందన తప్పు. వాళ్ళు అలా అనేసారు, వీళ్ళు ఇలా అనేసారు అనుకొని దుఖం తెచ్చుకోవటం, బాధ తెచ్చుకోవటం నువ్వు చేసుకుంటే, అది నీది తప్పు. ఆ విమర్శలకి రియాక్ట్ అవ్వకుండా ఉండటం నేర్చుకో. నీ లోపల అజ్ఞానం ఉంది కాబట్టి వాళ్ళు నన్ను అనేసారు అనుకుంటావు. ఆ రియాక్ట్ అయ్యే స్వభావం తగ్గించుకో. నీ పని ఏదో నువ్వు చూసుకొని వెళ్ళిపో. ఆ రియాక్ట్ అయ్యే స్వభావం వదిలేసి మంచి నేర్చుకో. ఎలా ఉంటే రియాక్ట్ అవ్వకుండా ఉంటామో అది నేర్చుకో. ఇది నువ్వు నేర్చుకోవలసింది అని భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు.

**ది॥ 10-07-2025 గురువారము నాడు గురు పౌర్ణమి**
**సందర్భముగా సద్గురు శ్రీ నాన్నగారి దివ్య సన్నిధి**



# శ్రీకృష్ణజన్మాష్టమి

తన లీలతో కర్మ, భక్తి, యోగ, జ్ఞాన వైరాగ్యముల గురించి ప్రపంచానికి తెలియజేసిన శ్రీకృష్ణపరమాత్మ శరీరం ధరించినరోజు శ్రీకృష్ణాష్టమి, అదే శ్రీకృష్ణ జయంతి. శ్రీకృష్ణాష్టమి రోజున తల్లులు యశోదలుగా, పిల్లలను కృష్ణయ్యలుగా భావించి అనగా తమ బిడ్డలను శ్రీకృష్ణుని ప్రతిరూపాలుగా భావించి అంగరంగవైభవంగా వేడుకలు జరుపుకుంటారు. శ్రీకృష్ణుడు వెన్న దొంగ అంటాం. అనగా "మానస-చోరుడు" అని అర్థం. శ్రీకృష్ణ తత్త్వం అంతా భక్తుల మనసు దోచుకోవడమే. శ్రీకృష్ణుని ప్రతీ కదలికా కృష్ణలీలే. పరమానందమే శ్రీకృష్ణుని నిజస్వరూపం. తాను నిరంతరం ఆనందముగా ఉండి, తోటివారందరినీ ఆనందముగా ఉండమనేవాడు. అదే రీతిగా మనము ఎల్లప్పుడూ ఆనందముగా ఉండి, తోటివారికి ఆనందాన్ని అందించాలి. బాధలు, కష్టాలు వచ్చి పోతుంటాయి అవన్నీ కదిలే మేఘాలవంటివి, వాటికి దుఃఖించకూడదు. తన స్వరూపమే అయిన సచ్చిదానంద స్థితిని ఎరుగలేని మానవులు మాయకు లోనై, భయంతో శోకిస్తారు. సర్వవ్యాప్తమై, ఆనందసాగరమైన ఆత్మను తానుగా తెలుసుకున్న జ్ఞానులు మాయాతీతులై ఆనందస్వరూపులవుతారు అన్నారు శ్రీకృష్ణపరమాత్మ. శ్రీకృష్ణుడు అంటే ఆకర్షించేవాడు. ఈ సంసార సాగరం నుండి పైకిలాగి, తనవైపు ఆకర్షించి, ముక్తిమార్గం చూపెడతాడు, అదే ఆత్మ జ్ఞాన రహస్యం. కర్మలనాచరిస్తూ వాటిలో చిక్కకుండా సాక్షీభూతులుగా ఉండాలి అన్నదే పరమాత్మ ఉపదేశం. పరమాత్మ సర్వవ్యాపి ఎట్లనగా పాలలోని వెన్నలాగున. పాలు అంతటిలోనూ వెన్న ఉంటుంది, వెన్న ఉంటుంది కాని మన కంటికి కనిపించదు. వెన్న మనకు కనిపించాలంటే, దానిని మనము తినాలంటే, దానిని మనము పొందాలంటే, ఏం చేయాలో మనకు తెలుసు. అదే విధముగా పరమాత్మ మన స్థూల నేత్రాలకి కనిపించడు, జ్ఞాననేత్రానికి కనిపిస్తాడు. అందులకు నిష్కామకర్మ, భగవద్భక్తి, జ్ఞానవిచారణ ఆవశ్యకములు. శ్రీకృష్ణ పరమాత్మకు శరణాగతి చెందడం మన పని, ఆపై అనుగ్రహించడం ఆయన పని. సృష్టిలోని సమస్త ప్రాణుల వెలుపల, లోపల ఉన్నది అట్లే సకల చరాచరముల రూపంలో ఉన్నది తానేనన్నాడు పరమాత్మ. అక్షరుడైన పరమాత్మ మానవరూపం ధరించాడు అదే శ్రీకృష్ణుని యొక్క దివ్యమంగళ స్వరూపం. "నేను భూత మహేశ్వరుడను" అన్నారు శ్రీకృష్ణపరమాత్మ.

**(ది॥ 16-08-2025 శ్రీకృష్ణాష్టమి సందర్భముగా....)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**